సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 29 । నవంబర్ । 2024




గడ్డిని కాల్చొద్దు.. కలిపి దున్నేద్దాం
పశువులకు పనికిరాదన్న ఉద్దేశంతో ఎండు గడ్డిని పొలాల్లోనే రైతులు తగులబెట్టడం వల్ల భూసారానికి తీవ్ర నష్టం కలుగుతుందని వ్యవసాయ శాఖ చెబుతోంది.

8లో



సనాతన ధర్మాన్ని వీడొద్దు
భ్రమలకు లోనై సనాతన ధర్మాన్ని వీడవద్దని, సనాతన హిందూ ధర్మం బాగుంటే ప్రపంచమే బాగుంటుందని జగద్గురు విధుశేఖర భారతీ స్వామీజీ అన్నారు.

కడలిలోకి 17 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 17,382 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. డెల్టా కాలువలకు 4,200 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఉద్యమ్ సర్వే కీలకం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల రంగం ద్వారా ఆర్థిక వ్యవస్థ పురోగతికి, ఉపాధి కల్పనకు ఉద్యమ్ సర్వే కీలకమైనదని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ 26 జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూక్ష్మ,చిన్న, మధ్య, తరహా పరిశ్రమల సర్వే, భూ సమస్యలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం ద్వారా పెట్టుబడులను రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని వాటి ఆధారంగా ఉపాధి అవకాశాలను కల్పించాలని నిర్దేశించిందన్నారు. ఎంఎస్ఎంఈల వృద్ధిని వేగవంతం చేయడం ద్వారా వాటి ఉత్పత్తులను బ్రాండింగ్ చేసి అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దేందుకు ఈ విధానం తోడ్పడుతుందని ప్రభుత్వం భావిస్తోందన్నారు. వివిధ ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఎంఎస్ఎంఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరని అన్నారు. క్రెడిట్ లింక్ క్యాపిటల్ సబ్సిడీ, క్రెడిట్ గ్యారంటీ, ప్రత్యేక రుణ పరిగణన, తక్కువ వడ్డీకే రుణాలు, వ్యాపార విస్తరణ పెట్టుబడి ప్రణాళికలకు మద్దతు, క్రెడిట్ సౌకర్యాలు పొందేందుకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఉపయోగిస్తుందన్నారు.

తుపానుతో అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఫెంగల్ తుపానుగా మారిన నేపథ్యంలో రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని చిరతపూడిలో వరిచేలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుపాను నేపథ్యంలో రైతులు కోసిన వరి చేలను ఒబ్బిడి చేసుకోవాలన్నారు. కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. కోసిన వరి పనలను తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మొలకెత్తకుండా ఉప్పు నీటి ద్రావణాన్ని చల్లాలన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించి, రిజిస్టర్లు తనిఖీ చేశారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి 6 నుండి 7 మిల్లులను జత చేశామన్నారు. తేమ శాతం 17 కంటే తక్కువ ఉన్న ధ్యాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో స్థానిక హైస్కూలులో ఉన్న పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీకర్ ఉపాధ్యాయుడిగా మారి, విద్యార్థులను పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు. స్థానిక హైస్కూలులో ప్రధానమంత్రి స్కూల్ రైజింగ్ పథకంలో రూ.15.58 లక్షలతో ఏర్పాటు చేస్తున్న రసాయన ప్రయోగశాల, వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులను పరిశీలించారు. తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎంపీడీవో వి.సరోవర్, ఇన్‌చార్జి హెచ్ఎం బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గౌరవ నరకం

- స్వచ్ఛంద సేవపై సర్కారు కక్ష
- గౌరవ వేతనాల కోసం వలంటీర్ల ఎదురుచూపు
- 5 నెలలుగా చెల్లించకుండా తాత్సారం
- రూ.10వేలు ఇస్తామన్న హామీ నెరవేరని వైనం
- వ్యవస్థ కొనసాగింపుపై స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం

హామీలు అనేవి ఎన్నికల్లో గెలిచేటందుకు ఇచ్చేవేగాని అమలు చేయడానికి కాదు అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడు మరోసారి రుజువు చేశారు. ఎన్నికల ఏరు దాటే వరకు ఓడ మల్లన్న అయిన ఓటరు.. తర్వాత ఆయన దృష్టిలో బోడి మల్లన్న అని తాజాగా నిరూపించారు. 2014 ఎన్నికల్లో రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని ప్రచారం చేసి గెలిచిన ఆయన ఆ హామీని అరకొరగా అమలు చేసి ఓటర్లను ఏమార్చారు. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చాక ఆ ఊసెత్తడం లేదు. గ్రామ/వార్డు వలంటీర్ల గౌరవ వేతనం రూ.10 వేలు చేస్తామన్న చంద్రబాబు ఆ హామీకీ గ్రహణం పట్టించారు. అటు గౌరవ వేతనం ఐదు నెలలుగా అందక, ఇటు ఉద్యోగం ఉందో ఊడిందో తెలియక వలంటీర్లు నరకయాతన పడుతున్నారు.



అస్పత్రిలో ఉన్న సత్యనారాయణమూర్తికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ జ్యోతి (ఫైల్)



వాకలగరువులో వరద నీటిలో ప్రజలకు నిత్యావసర వస్తువులు తీసుకువెళుతున్న వలంటీర్ (ఫైల్)

అంబాజీపేట: వారంతా చిరు ఉద్యోగులు, నెలకు రూ.5వేల గౌరవ వేతనంతో పనిచేసే స్వచ్ఛంద సేవకులు వారు. వారిపై కూటమి ప్రభుత్వం కన్నెర్ర చేసింది. దీంతో ఐదు నెలలుగా వార్డు వలంటీర్లకు వేతనాలు అందడం లేదు. గౌరవ వేతనంతోనే బతికే చిరుద్యోగులు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 7,30,926 ఇళ్లు ఉన్నాయి. మొత్తం మూడు డివిజన్లలో రేషన్ కార్డులు 5,47,723 ఉన్నాయి. వీటి పరిధిలో 6,607 మంది వలంటీర్లు గతంలో పనిచేసేవారు. పదో తరగతి పాసైన వారికి వలంటీరు ఉద్యోగం ఇస్తామని గత ప్రభుత్వం హయాంలో ప్రకటించినా ఎక్కువ శాతం మంది డిగ్రీ చదివిన నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో గౌరవ వేతనానికే పనిచేసేందుకు ముందుకు వచ్చారు. భవిష్యత్తులో ప్రభుత్వం తమ సేవలను గుర్తించి ప్రాధాన్యం ఇస్తుందనే చిరు ఆశతో ఈ చిరు ఉద్యోగంలో పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు చేరారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి బాధితులకు సహాయ సహకారాలు అందించి వారికి అండగా నిలిచారు. వరదల సమయంలోను బాధితులకు అండగా మేము ఉన్నాం అంటూ వారికి భరోసా కల్పించి సహాయ సహకారాలు, సేవలు అందించారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన వలంటీర్లపై కూటమి నేతలు ఎప్పటికప్పుడు విషం కక్కుతూనే ఉన్నారు. అయినప్పటికీ అవేమీ లెక్క చేయకుండా వలంటీర్ల విధులు నిర్వహిస్తూ వారికి ఇచ్చిన కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించి వారికి అండగా నిలిచారు.

రూ.10వేల వేతనం హామీ గాల్లోనే...

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ల వేతనం రూ.10వేలకు పెంచుతామని చెప్పిన చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇంత వరకూ వలంటీర్ల వేతన బకాయిలు, నూతన నియామకాలపై ఎటువంటి ప్రకటన చేయలేదు. పెంపుదల మాట అలా ఉంచితే కనీసం గతంలో ఇచ్చే రూ.5వేలు కూడా ఇవ్వకపోవడంపై వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. తాజాగా ప్రభుత్వం తీరు చూస్తుంటే మొత్తం వ్యవస్థకే మంగళం పాడే పరిస్థితి కనిపిస్తోంది. కూటమి నేతలు వలంటీర్ల వ్యవస్థ కొనసాగింపుపై స్పష్టత ఇవ్వకుండా నీరుగారుస్తున్నారు. తాజాగా శాసన మండలిలోనూ వలంటీర్లపై వాడీవేడిగా చర్చ జరిగింది. వలంటీర్ల వ్యవస్థపై స్పష్టత ఇవ్వాలని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రభుత్వాన్ని నిలదీసినా ఫలితం లేకపోయింది.

సేవలకు దూరంగానే..

గతంలో వలంటీర్లు తమకు కేటాయించిన 50 గృహాలకు సంబంధించి అన్ని పనులు దగ్గరుండి చక్కబెట్టేవారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి ఐదే తేదీ వరకు ఇచ్చే పింఛన్లు దగ్గరుండి తమ పరిధిలోని ప్రజలకు క్రమం తప్పకుండా అందించేవారు. వీటికితోడు అన్ని ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేసేందుకు కృషి చేసేవారు. అలాంటి వలంటీర్ల సేవలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం వినియోగించుకోకుండా తమ కార్యకర్తలకు ఆ పనులను అప్పజెప్పింది. కావాలనే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నియమించిన వలంటీర్లను, వారి సేవలకు దూరం పెడుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో ఇలా...

మొత్తం డివిజన్లు :	3
మొత్తం సచివాలయాలు :	515
ఎన్నికల ముందు పనిచేసిన వలంటీర్లు :	6,607
మొత్తం ఇళ్ల సంఖ్య :	7,30,926
రేషన్ కార్డుల సంఖ్య :	5,47,723
రేషన్ షాపుల సంఖ్య :	926

విధుల్లోకి తీసుకోవాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చిందనే కారణంతో చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యగా కూటమి ప్రభుత్వం ప్రవర్తించడం సరికాదు. అధికారంలో ఎవరు ఉన్నా ప్రతీ ఒక్కరి సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేయాల్సిన అవసరం ఉంది. తక్షణమే వలంటీర్లకు 5 నెలల వేతనాలు చెల్లించి, వలంటీర్లను కొనసాగించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10వేలు వేతనం ఇస్తూ విధుల్లోకి తీసుకోవాలి.

– ఉందుర్తి నాగమల్లేశ్వరి, వలంటీర్, అంబాజీపేట

తక్షణమే వేతనాలు చెల్లించాలి



గ్రామ, వార్డు వలంటీర్లకు తక్షణం వేతన బకాయిలు చెల్లించాలి. ఐదు నెలలుగా వలంటీర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వేతనాలు తక్షణమే విడుదల చేయాలి. ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు నెలకు రూ.10వేల వేతనం పెంచి విధుల్లోకి తీసుకుని ఆదుకోవాలి.

– కాండ్రేగుల నాగబాబు, వలంటీరు, వాకలగరువు

బీసీ కుల గణన చేపట్టాలి

- పూలే వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు డిమాండ్



అమలాపురంలో పూలే విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, నాయకులు

అమలాపురం టౌన్: రాష్ట్రంలో తక్షణమే కుల గణన చేపట్టాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా అమలాపురంలోని మున్సిపల్ చిల్డ్రన్ పార్కు వద్ద గల పూలే విగ్రహానికి ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు గురువారం ఉదయం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు పర్యవేక్షణలో నిర్వహించిన రాష్ట్ర బీసీ కుల గణన సర్వే నివేదికను నేటి కూటమి ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం మాదిరిగా బీసీలకు రాజ్యాధికారం కోసం ప్రత్యేక చైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. పూలే ఆశయ సాధనకు మేమంతా కట్టుబడి పని చేస్తామని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నాయకులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్రంలో 139 బీసీ కులాల వృత్తి ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలని, 50 శాతం రిజర్వేషన్ బెంచ్ మార్కు ఎత్తివేయాలని నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ బీసీ నాయకులు కుడుపూడి త్రినాథ్, చిట్టూరి పెదబాబు, ముంగర ప్రసాద్, అంబేడ్కర్ సేవా సమితి ప్రతినిధి చీకురుమిల్లి కిరణ్‌కుమార్ తదితరులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉత్తీర్ణత మెరుగయ్యేలా..

- సంకల్ప్–25 పేరిట సరికొత్త కార్యక్రమం
- ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- 1 నుంచి అమలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఇంటర్మీడియెట్ విద్యా శాఖ సంకల్ప్–25 పేరిట కొత్త కార్యక్రమం చేపడుతోంది. గత ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా నమోదు కావడంతో ఈ చర్యలు తీసుకుంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి 5 వరకూ దీనిని అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా చదువులో వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రం 4 నుండి 5 గంటల వరకూ స్టడీ అవర్ నిర్వహిస్తారు. గత అక్టోబర్‌లో నిర్వహించిన త్రైమాసిక పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను పూర్, గుడ్, ఫెయిల్డ్ అనే మూడు గ్రూపులుగా విభజిస్తారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో ఐదారుగురికి ఒక అధ్యాపకుడిని కేటాయిస్తారు. వీరందరూ పాసయ్యేలా చూడాల్సిన బాధ్యత ఆ అధ్యాపకుడిపై ఉంటుంది. అన్ని కళాశాలలకు సమాధానాలతో రూపొందించిన క్వశ్చన్ బ్యాంకు ఇస్తారు. రోజువారీ అధ్యయనంలో భాగంగా విద్యార్థులందరూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ క్వశ్చన్ బ్యాంకు చదివి, ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. అవసరమైతే 5 గంటలు దాటిన తరువాత కూడా స్టడీ అవర్ కొనసాగిస్తారు. గతంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ తరగతులు నిర్వహించే వారు. ఇప్పుడు 9 నుంచి 5 గంటల వరకూ నిర్వహిస్తారు. విద్యార్థులందరూ అన్ని సబ్జెక్టుల్లోనూ ఉత్తీర్ణులయ్యేలా టైం టేబుల్ రూపొందిస్తారు. సంబంధిత జిల్లా అధికారులు వారానికి మూడు రోజులు కళాశాలలను సందర్శించి, సంకల్ప్ కార్యక్రమం అమలుపై సమగ్ర నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

పరీక్ష ఫీజు గడువు పెంపు

ఇంటర్ పరీక్ష ఫీజు గడువును అధికారులు పెంచారు. ఎటువంటి ఫైన్ లేకుండా వచ్చే నెల ఐదో తేదీలోగా విద్యార్థులు ఫీజు చెల్లించవచ్చు.

జిల్లాలో జూనియర్ కళాశాలల వివరాలు

హైస్కూల్ ప్లస్	14
ప్రభుత్వ కళాశాలలు	15
మోడల్ స్కూల్	2
కేజీబీవీ	4
ఏపీఎస్‌ఆర్‌డబ్ల్యూ	8
ప్రైవేటు ఎయిడెడ్	4
ప్రైవేటు కళాశాలలు	99
ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	45,306

నిరంతర పర్యవేక్షణ



నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక అమలు చేస్తున్నాం. ఏ సబ్జెక్టులో విద్యార్థి వెనుకబడి ఉన్నాడో గుర్తించి, దానిపై పట్టు సాధించేలా బోధన ఉంటుంది. నిబంధనల మేరకు అదనపు తరగతుల నిర్వహణ బాధ్యతలను ఆయా కళాశాలల అధ్యాపకులు చేపట్టారు. విద్యార్థుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.

– జీజీకే నూకరాజు, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి, కాకినాడ

సజావుగా పరీక్షలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: జాతీయ ఉపకార వేతన పరీక్షలు డిసెంబర్ 8వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జాతీయ ఉపకార వేతన పరీక్షలు–2024 నిర్వహణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 13 పరీక్షా కేంద్రాలను మూడు రెవెన్యూ డివిజన్లలో ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 విధించాలని, పేపర్ లీకేజీలకు ఆస్కారం లేకుండా తొలుతగా ప్రశ్నాపత్రాలు తరలింపు చివరిగా జవాబు పత్రాలు గమ్యస్థానాలకు చేర్చడం ప్రక్రియలను పోలీసుల భద్రత నడుమ నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రాథమిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, ఆర్టీసీ విద్యార్థులకు బస్సులు నడపాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దుర్గారావు దొర, జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా, ట్రాన్స్‌కో ఎస్సీ ఎస్.రాజబాబు, డీపీఆర్ఓ కె.లక్ష్మీనారాయణ, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి సూర్యప్రకాశం పాల్గొన్నారు.

పరిశ్రమల బలోపేతానికి సర్వే

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు బలోపేతానికి యూనిట్లన్నింటిని ఒక గొడుగు కింద తెచ్చి రాయితీలతో ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ సర్వేను ప్రభుత్వం చేపట్టిందని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకరప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంఎస్ఎంఈ సర్వే విధి విధానాలపై ఆయన, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి ఏపీవీ మాధురి, డీఎల్‌డీఓ ఎస్.త్రినాథరావు దిశా నిర్దేశం చేశారు. పీడీ మాట్లాడుతూ ప్రభుత్వాల జోక్యానికి, చర్యల రూపకల్పనకు డేటాబేస్ అవసరమని, అందుకే సర్వే కోసం ఉద్యమ్ యాప్‌ను ప్రభుత్వం రూపొందించిందని ఆయన తెలిపారు. రాయితీలు ఇవ్వడానికి, మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు ఈ సర్వే దోహదపడుతుందన్నారు.

మంచు కురిసే వేళలో.. ముంచుకొచ్చే ముప్పులో...

- వణికించే చలిలో వాకింగ్‌తో ముప్పు
- గుండె, శ్వాస సమస్యలకు ఆస్కారం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు
- చలిలో వాకింగ్‌కు వెళ్లి అస్వస్థతకు గురవుతున్న వృద్ధులు
- 10 రోజుల్లో జీజీహెచ్‌లో చేరిన 24 మంది



జీజీహెచ్ కార్డియాలజీ వార్డులో చికిత్స పొందుతున్న వృద్ధులు

కాకినాడ క్రైం: మంచు కురిసే వేళను ఆస్వాదిస్తూ బయట తిరుగుతున్నారా.. తస్మాత్ జాగ్రత్త! శీతల వాతావరణంతో ఆహ్లాదం, ఆనందం మాటెలా ఉన్నా.. అనారోగ్యపు ముప్పు తప్పకపోవచ్చు. అప్రమత్తంగా లేకపోతే వణికించే చలిగాలులకు శ్వాస ఇబ్బందులు తలెత్తవచ్చు. గుండెకు ప్రమాదాన్ని తెచ్చి పెట్టవచ్చు. నడక మంచిదే అయినా, మంచులో నడక అన్ని వేళల్లో శ్రేయస్కరం కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో సతమతవవుతున్నవారు.. ఆరోగ్యం సిద్ధించాలనే సత్సంకల్పంతో ఉదయపు నడకతో ఉత్సాహంగా రోజు మొదలు పెట్టాలనుకునే వారు శీతాకాలంలో.. ముఖ్యంగా మంచు కురిసే వేళలో ముంచుకొచ్చే ముప్పుతో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇండోర్ వ్యాయామాలకే ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతున్నారు. శీతాకాలం మొదలైనప్పటి నుంచి వాతావరణంలో ప్రతికూల మార్పులు చోటు చేసుకున్నాయి. గడచిన పది రోజుల్లో చలిలో మార్నింగ్ వాక్‌కు వెళ్లి అస్వస్థతకు గురైన 24 మంది కాకినాడ ప్రభుత్వాసుపత్రి(జీజీహెచ్)లో చేరారు. మంచులో నడకకు వెళ్లిన వారిలో గుండె, శ్వాసకోశ, కీళ్ల సమస్యలను గుర్తించారు. వీరిలో ఏడుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

ముప్పు ఇలా..

- వైద్యులు చెబుతున్న దాని ప్రకారం.. మంచులో నడక అన్ని వేళల్లో, అన్ని ఆరోగ్య స్థితుల్లో మంచిది కాదు. అప్పటికే నిద్రాణ స్థితిలో లేదా స్వల్ప తీవ్రతతో ఉన్న గుండె, శ్వాసకోశ సమస్యలు తిరగబెట్టే ప్రమాదం ఉంటుంది.
- కోవిడ్ తదనంతర ప్రభావంతో చిన్న వయసు వారిలో కూడా వైద్యులు గుండె జబ్బులు గుర్తిస్తున్నారు. యావత్ ప్రపంచాన్నే అతలాకుతలం చేసేసిన కోవిడ్ మహమ్మారి చలికాలంలో అక్కడక్కడ తన ఉనికిని చాటుకుంటోంది. అప్పటికే పలు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నవారు.. మంచులో మార్నింగ్ వాక్‌కు వెళ్తే కోవిడ్ ప్రభావం అధికంగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. పోస్ట్ కోవిడ్ ప్రభావానికి గురైన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ మంచులో నడక కొనసాగించవద్దనే సూచిస్తున్నారు.
- ఆస్తమా బాధితులకు చలికాలం ఓ సవాలు వంటిది. చల్లగాలుల వల్ల ఆస్తమా అనుబంధ శ్వాస సమస్యలు అధికమవుతాయి. అటువంటి వారు మంచులో మార్నింగ్ వాక్ మొదలు పెడితే అనర్థాలు మరింత పెరగవచ్చు. మార్నింగ్ వాక్ చేసే ఆస్తమా బాధితులు గురక, ఛాతి భారంగా మారడం, శ్వాస సరిగ్గా తీసుకోలేకపోవడం, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే నడకను ఆపేయాలి. వైద్యుడిని సంప్రదించాలి.

వీరు జాగ్రత్తగా ఉండాలి

హృద్రోగ బాధితులు, శ్వాసకోశ సంబంధ వ్యాధిగ్రస్తులు, ఎముకలు, కీళ్ల సమస్యలు ఉన్నవారు, పోస్ట్ కోవిడ్ బాధితులు, ఊబకాయంతో సతమతమయ్యే వారు, ఆస్తమా బాధితులు, కొన్ని రకాల చర్మ సమస్యలతో బాధ పడుతున్న వారు, రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మంచులో నడకను మానితే మంచిది. అనివార్యమైతే వైద్యుడి సలహా తప్పనిసరి.



మంచు కురుస్తున్న వేళ ఇండోర్‌లో యోగాభ్యాసం

గుండెపోటుకు అవకాశం



చల్లని వాతావరణం గుండెపై అధిక ఒత్తిడికి కారణమవుతుంది. అప్పటికే గుండె సమస్యలు ఉన్నవారు, ముఖ్యంగా కరోనరీ ఆర్టరీల్లో బ్లాక్స్ ఉన్న వారికి మరింత ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. అటువంటి వారిలో కార్డియాక్ రిస్క్ మరింత పెరిగి గుండెపోటుకు దారి తీయవచ్చు. తేమను కలిగి ఉండే శీతల గాలులు గుండె కొట్టుకునే వేగాన్ని అసాధారణంగా పెంచి, శరీరాన్ని మరింత చల్లబరిచి ప్రమాదానికి కారణమవుతాయి. రక్తపోటు, గుండె కొట్టుకునే వేగం పెరగడం వల్ల శరీరం మొత్తానికి రక్తాన్ని పంపడం గుండెకు కష్టతరమవుతుంది. తద్వారా గుండెపోటు వచ్చే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ సురేష్ వాసంశెట్టి, కార్డియాలజీ నిపుణుడు

ఈ వేళలు మేలు



న్యూమోనియా, ఆస్తమా వ్యాధిగ్రస్తులు శీతాకాలంలో ఉదయం నడకకు వెళ్లవద్దు. చల్లటి గాలి శ్వాస ప్రక్రియకు ఇబ్బందికరంగా మారుతుంది. చలికాలంలో మార్నింగ్ వాక్ కొన్నిసార్లు ప్రమాదకరం. సమయాన్ని అనుసరించి నడక కొనసాగించాలి. మిగిలిన సీజన్లలో మాదిరిగా తెల్లవారుజామున నడక శీతాకాలంలో ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. అలాగే రాత్రి వేళల్లోనూ చల్లదనం కమ్మేస్తుంది. ఈవెనింగ్ వాక్‌కు కూడా మంచు ప్రభావం లేని ఓ నిర్దిష్ట సమయాన్ని ఎంచుకోవాలి. ఉదయం 8.30–9.30 మధ్య, సాయంత్రం 5–6 గంటల మధ్య నడక మంచిది.

– డాక్టర్ సుధీర్, ఈఎన్‌టీ నిపుణుడు, పూర్వపు ఆర్ఎంఓ, జీజీహెచ్, కాకినాడ

శీతాకాలంలో యోగాతో ప్రయోజనం



శీతాకాలంలో యోగా సాధన ఎంతో మంచిది. మంచులో నడకతో అనారోగ్యం బారిన పడకుండా అంతకు మించిన ప్రయోజనాలను యోగాలో పొందవచ్చు. మొత్తం శరీరానికి పూర్తి స్థాయిలో వ్యాయామాన్నిచ్చే ఎన్నో ప్రక్రియలు యోగాలో ఉన్నాయి. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా అభ్యసించవచ్చు. మంచు కురిసే వేళలో వృద్ధులు శారీరక ఆరోగ్యం కోసం నడకను ఆశ్రయిస్తారు. వారు ప్రత్యామ్నాయంగా యోగాను ఎంచుకోవచ్చు. నడక ద్వారా వారు ఆశిస్తున్న రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పుల నియంత్రణ యోగాతో సాధ్యమవుతుంది. యోగా సాధనతో పూర్తి ఆరోగ్యం సిద్ధించడంతో పాటు మంచు ముప్పు తొలగుతుంది.

– సుంకరణం ఇందిరాదేవి, యోగా కోచ్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ, కాకినాడ

క్లుప్తంగా

అదానీపై అభియోగాలను జగన్‌కు ఆపాదించడం అన్యాయం

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: యూఎస్‌ఏలో అదానీ గ్రూపుల ద్వారా లంచాలు అందాయన్న ఆరోపణలు, అభియోగాలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఇందులో ఆయనను ఇరికించాలనుకోవడం అన్యాయమని న్యాయవాది, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అదానీ గ్రూపుపై లంచాలు ఇచ్చినట్లు అమెరికా దేశంలో నమోదైన ఎఫ్‌ఐఆర్‌లో అసలు మాజీ ముఖ్యమంత్రి జగన్ పేరే లేదని ఆయన స్పష్టం చేశారు. పేరే లేనప్పుడు ఆరోపణలకు, అభియోగాలకు ఆస్కారమెక్కడని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేంద్ర ప్రభుత్వ పబ్లిక్ సెక్టార్ సంస్థ. దీని కంట్రోల్ అంతా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోనే ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుతోపాటు వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా విభాగం అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్ అదానీ లంచాల వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. కేవలం కక్ష పూరిత ధోరణిలో ఆయనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర కూటమి ప్రభుత్వం ముఖ్య నాయకులు అభియోగాలు మోపి అనవసర, అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నిడదవోలు : పట్టణంలోని గణేష్‌చౌక్ సెంటర్ కరూర్ వైశ్య బ్యాంకు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. చాగల్లు మండలం మార్కొండపాడు గ్రామానికి చెందిన మల్లవరపు నరసింహారావు(50) ఇంటి నుంచి తన కుమారుడు సంతోష్‌ను స్కూటర్‌పై ఎక్కించుకుని నిడదవోలు పట్టణానికి వచ్చాడు. కుమారుడిని స్కూల్ బస్సు ఎక్కించి తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో నిడదవోలు మండలం సింగవరం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మద్దాల భానుప్రకాష్, శెట్టి సందీప్ స్పోర్ట్స్ బైక్‌పై అతి వేగంగా వెనుకనుంచి వచ్చి స్కూటీని ఢీకొట్టారు. దీంతో స్కూటీపై ఉన్న నరసింహారావు ఎగిరి కింద పడ్డాడు. స్కూటీ పూర్తిగా ధ్వంసమైంది. తీవ్ర గాయాలైన నరసంహారావును స్థానికులు 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడు నరసింహారావుకి భార్య లక్ష్మీశ్రీ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పట్టణ ఎస్సై పి.శోభన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పట్టపగలే దొంగతనం

20 గ్రాముల బంగారం, వెండి వస్తువులు చోరీ

ఐ.పోలవరం: తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగలుపడి ఇంటిని గుల్ల చేసిన ఘటన ఐ.పోలవరం మండలంలో చోటు చేసుకుంది. కొమరగిరి వీర్రాజు చెరువు వద్ద నివాసం ఉంటున్న యనమదల రమేష్ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం పట్టపగలే దొంగతనం చేశారు. ఇంట్లో రమేష్ తల్లి యనమదల నాగరత్నం ఒక్కరే ఉంటున్నారు. ఆమె రోజూ మాదిరిగా ఇంటికి తాళం వేసి కూలి పనికి వెళ్లింది. ఇంటి తాళాన్ని బద్దలు కొట్టి 20 గ్రాముల బంగారం, వెండి వస్తువులు, ఇత్తడి బిందెలు, నాలుగువేల నగదు చోరీ చేసినట్టు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తాను కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చేసిరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని పేర్కొంది. ఘటనా స్థలాన్ని సీఐ మోహన్‌కుమార్, రైటర్ హరనాథ్ పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డిని కాల్చొద్దు.. కలిపి దున్నేద్దాం

- పొలాల్లోనే గడ్డిని తగులబెడితే భూసారానికి తీవ్ర నష్టం
- సూక్ష్మ పోషకాలు నశించడంతో దిగుబడిపై ప్రభావం
- అధునాతన యంత్రాల ద్వారా గడ్డిని సేకరించాలి



పినపళ్లలో పొలంలో తగులబడుతున్న ఎండుగడ్డి

అలమూరు: ఖరీఫ్, రబీ సీజన్లలో అనేకమంది రైతులు వరికోత యంత్రాలనే వినియోగిస్తున్నారు. రబీ సీజన్ కంటే ఖరీఫ్ సీజన్‌కు లభించే గడ్డినే ఎక్కువగా పశువులకు దాణాగా ఉపయోగించడం స్థానిక రైతులకు అలవాటుగా మారింది. దీంతో ఖరీఫ్ సీజన్‌లో లభించే గడ్డికి డిమాండ్ ఎక్కువగా ఉన్నా కోత యంత్రాల వల్ల వాటి లభ్యత అంతంత మాత్రంగా ఉంటోంది. పొలాల్లో గడ్డి నలిగిపోవడం వల్ల పశువులకు పనికిరాదన్న ఉద్దేశంతో ఎండుగడ్డిని పొలాల్లోనే రైతులు తగులబెడుతున్నారు. దీనివల్ల భూసారానికి తీవ్ర నష్టం కలుగుతుందని, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యవసాయశాఖ చెబుతోంది. ఆ గడ్డిని పొలంలోనే ఉంచి దమ్ముల సమయంలో కలిపిదున్నడం ద్వారా భూమికి మేలు జరుగుతుందని చెబుతున్నారు. ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన స్ట్రాబేలర్ యంత్రాలను వినియోగించి ఎండుగడ్డిని సంరక్షించుకోవాలని సూచిస్తున్నారు. పొలాల్లో నలిగిన గడ్డిని యంత్రం ద్వారా మోపులుగా సేకరించి పశుగ్రాసంగా వినియోగించవచ్చునని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. స్ట్రాబేలర్ యంత్రాన్ని వినియోగించి గడ్డిని సేకరించడం ద్వారా రైతులకు కొద్దిమేర ఆదాయం లభిస్తుంది. వరి కోత యంత్రాల ద్వారా లభ్యమైన గడ్డిని ఏదోవిధంగా సద్వినియోగం చేసుకోవాలే తప్ప కాల్చడం సరికాదనే అభిప్రాయాన్ని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ

జిల్లాలో 1.69 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్ వరి సాగు జరిగింది. ఇప్పటికే సుమారు 70 శాతం మేర వరి కోతలు పూర్తయ్యాయి. ఇటీవల కాలంలో వరికోత యంత్రాలతో మసూళ్లు చేయడం వల్ల గడ్డి పనికి రాకుండా పోతోంది. కోత కోసినప్పుడు గడ్డి నలిగిపోతుందని, దీంతో పశువులు ఆ గడ్డిని తినేందుకు అంతగా ఇష్టపడవని భావిస్తున్న రైతులు పొలాల్లోనే తగులబెట్టడం పరిపాటిగా మారింది. ఈ గడ్డి తగుల బెట్టినప్పుడు వేడిగాలులతో సమీపంలోని ప్రజలు, రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. మంటలు ఒక పొలం మీదుగా మరొక

పాడి-పంట

పొలానికి వ్యాపిస్తూ ధాన్యపు రాశులతో పాటు పొలాల్లో దిమ్మలపై ఉంచిన గడ్డి వాములు నిప్పంటుకుని బూడిదయిన ఘటనలు గతంలో ఎన్నో ఉన్నాయి. గడ్డిని తగులబెట్టకుండా దమ్ములో కలిపి దున్నడం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని వ్యవసాయాధికారులు అంటున్నారు. గడ్డిని కాల్చకుండా దున్నడం ద్వారా కలిగే ప్రయోజనాలు, చేలకు సంభవించే భూసారం వివరాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఇప్పటికే వ్యవసాయశాఖ సదస్సులను ఏర్పాటు చేసింది.

మురగడ దమ్ముతో ఫలితం

ఆరోగ్యవంతమైన భూమిలోని ఒక గ్రాము మట్టిలో టెన్ టూ ది పవర్ ఆఫ్ నైన్ (10,000000000) సూక్ష్మజీవులు ఉంటాయి. భూమిలో కుళ్లిన పదార్థాన్ని ఇవి ఆహారంగా తీసుకుని మొక్కలకు అవసరమైన సూక్ష్మ పోషకాలను అందిస్తుంటాయి. పొలాల్లోని గడ్డిని కాల్చివేయడం వలన ఈ సూక్ష్మ జీవులు చనిపోయి భూసారానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇలాంటి పరిస్థితుల వల్ల గతంలో రైతులు ఎప్పుడు వినియోగించని జింకు, బోరాన్ తదితర చిన్నచిన్న సూక్ష్మ పోషకాలను పొలాల్లో నేరుగా వేయాల్సి వస్తోంది. గడ్డిని తగులబెట్టకుండా పొలంలోనే కుళ్లించి నేలలో కలిపి మురగడ దమ్ము చేస్తే చక్కని ఫలితం ఉంటుంది. ఈ విధంగా చేసేటప్పుడు దమ్ముకు దమ్ముకు మధ్య వారం రోజుల వ్యత్యాసం ఉండాలి. దీనివల్ల ఈ గడ్డి బాగా కుళ్లి భూమిలో కలిసిపోయి మొక్కలకు అవసరమైన సూక్ష్మపోషకాలు సంవృద్ధిగా అందుతాయి.

దున్నడం ద్వారా భూసారానికి మేలు



పొలాల్లో గడ్డిని తగులబెట్టడం చాలా పెద్ద పొరబాటని రైతులు తెలుసుకోవాలి. దీని వల్ల సూక్ష్మజీవులు చనిపోయి భూసారం తగ్గిపోతుంది. పొలాల్లో పడి ఉన్న గడ్డితో కలిపి దమ్ము చేయడం ద్వారా భూసారం పెరుగుతుంది. మొక్కలకు అవసరమైన పోషకాలు సంవృద్ధిగా లభిస్తాయి. పొలంబడి కార్యక్రమాల్లో ఈ విషయమై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్.లక్ష్మీ లావణ్య, మండల వ్యవసాయాధికారిణి, అలమూరు

నేడు 'నన్నయ'లో పీజీ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

- ఏపీ పీజీ సెట్ రాయకపోయినా, రాసి అర్హత పొందకపోయినా అర్హులే
- ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని వదులుకోకండి
- ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు



రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను ఎంఏ, ఎం.కామ్, ఎంపీఈడీ, ఎమ్మెస్సీ కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు జరుగనున్నాయని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు తెలిపారు. ఏపీ పీజీ సెట్ రాయకపోయినా, రాసి అర్హత పొందకపోయినా ఈ స్పాట్ అడ్మిషన్స్‌లో పీజీలో చేరేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారికి ఇదొక చక్కటి అవకాశమని, దీనిని వదులుకోవద్దన్నారు. డిగ్రీలో ఓసీ, బీసీ అభ్యర్థులు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 45 శాతం పైబడిన మార్కులతో ఉత్తీర్ణతను పొందవలసి ఉందన్నారు. ఈ స్పాట్ అడ్మిషన్ల ద్వారా పీజీలో చేరేవారికి ఎటువంటి రాయితీలు వర్తించవన్నారు. 'నన్నయ' క్యాంపస్‌తోపాటు కాకినాడ, తాడేపల్లిగూడెంలలోని క్యాంపస్‌లలో ఉన్న ఖాళీల భర్తీకి కూడా ఆయా క్యాంపస్‌లలోనే కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 9 నుంచి 11 గంటల లోపు ఆయా క్యాంపస్‌లలో రిజిస్ట్రేషన్లు చేయించుకోవలసి ఉందన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్‌ని సందర్శించవచ్చు.

అన్నవరం రెగ్యులర్ ఈఓగా త్రినాథరావు?



త్రినాథరావు, ఇన్‌చార్జి ఈఓ, అన్నవరం దేవస్థానం

అన్నవరం: దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ వి.త్రినాథరావును రెగ్యులర్ ఈఓగా నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక్కడ ఇన్‌చార్జి ఈఓగా పనిచేసిన దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్‌ను ఆ బాధ్యతల నుంచి తొలగించి సింహాచలం ఆలయ రెగ్యులర్ ఈఓగా పనిచేస్తున్న త్రినాథరావును ఇన్‌చార్జి ఈఓగా నియమించిన విషయం విదితమే. సింహాచలం, అన్నవరం రాష్ట్రంలో ప్రముఖ దేవస్థానాలైనందున రెండు చోట్ల ఈఓగా ఎక్కువ కాలం పనిచేసే అవకాశం లేదు. దీంతో ఏదో ఒకచోట మాత్రమే ఆయనను కొనసాగించే అవకాశం ఉంది. అయితే అన్నవరం దేవస్థానంలోనే ఆయనను కొనసాగించే అవకాశం ఉందని సమాచారం.

మూడు దేవస్థానాలకు ఈఓలుగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు?

రాష్ట్రంలోని మూడు దేవస్థానాలకు ఈఓలుగా స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. ప్రస్తుతం అన్నవరం దేవస్థానం ఈఓ పోస్టు ఖాళీగా ఉంది. విజయవాడ కనకదుర్గ గుడి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ కేఎస్ రామారావు డిసెంబర్ 31 న పదవీ విరమణ చేస్తున్నారు. దీంతో అక్కడ కూడా ఈఓను నియమించాల్సి ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఈ దేవస్థానాలకు ఈఓలను నియమించే అవకాశం ఉంది. సింహాచలం దేవస్థానం పరిధిలోని పంచగ్రామాలలో భూవివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ను ఈఓగా నియమించి అక్కడ ఈఓగా ఉన్న త్రినాథరావును అన్నవరం దేవస్థానం ఈఓగా నియమిస్తారని తెలిసింది.

పుష్కరాలకు సీనియర్ అధికారి అవసరం

2027లో జరిగే గోదావరి పుష్కరాలకు భక్తులు లక్షలాదిగా అన్నవరం సత్యదేవుని దర్శనానికి విచ్చేసే అవకాశం ఉంది. అందువల్ల 2025 సంవత్సరంలో దేవస్థానంలో పుష్కరాల భక్తుల కోసం వివిధ నిర్మాణాలు, ఇతర ఏర్పాట్లు ప్రారంభించాల్సి ఉంటుంది. దేవదాయ శాఖలో సీనియర్ ఆర్‌జేసీ త్రినాథరావుకు గతంలో ఇక్కడ రెండుసార్లు ఈఓగా పనిచేసిన అనుభవం ఉంది. ఆయన హయాంలో పలు నిర్మాణాలు రూపుదిద్దుకున్నాయి. భక్తుల కోసం పశ్చిమ రాజగోపురం వద్ద విశ్రాంతి షెడ్లు, వాహనాల పార్కింగ్ స్థలాల అభివృద్ధితో బాటు ఇంకా పలు నిర్మాణాలు చేయాల్సి ఉంది. 'ప్రసాద్' స్కీం నిధులు రూ.25 కోట్ల తో అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్, వ్రత మంటపాల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో త్రినాథరావును రెగ్యులర్ ఈఓగా నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సనాతన ధర్మాన్ని వీడొద్దు

జగద్గురు విధుశేఖర భారతీస్వామి



సహస్ర మోదక మహాగణపతి పూర్ణాహుతిలో పాల్గొన్న శ్రీవిధుశేఖర భారతీ మహాస్వామి

గండేపల్లి: ఎవరు ఎన్ని చెప్పినా భ్రమలకు లోనై సనాతన ధర్మాన్ని విడనాడవద్దని, సనాతన హిందూ ధర్మం బాగుంటే ప్రపంచమే బాగుంటుందని జగద్గురు విధుశేఖర భారతీ స్వామీజీ పేర్కొన్నారు. మండలంలోని పి.నాయకంపల్లిలో తత్వం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన సువర్ణ భారతి గోశాల, పాకశాల, ప్రవచన మంటపాలను గురువారం ఆయన ప్రారంభించి భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భక్తులు ఏ రూపంలో కొలిచినా, ఏ పేరుతో పిలిచినా దేవుడు ఒక్కడేనని, ఆయా సందర్భాలలో రూపాన్ని బట్టి భక్తులకు దర్శనమిస్తున్నట్టు తెలిపారు. శంకరాచార్యులు వారు 1,200 వందల సంవత్సరాల క్రితం మనదేశంలో అవతరించి ధర్మ సంస్థాపన కోసం కృషి చేశారన్నారు. హిందూ ధర్మాన్ని నాశనం చేసేందుకు ఎన్ని ప్రయత్నాలు జరిగినప్పటికీ ధృడంగా ఉందంటే ఆయన చేసిన కృషి ఫలితమేనన్నారు. ఎటువంటి ప్రశ్నలకైనా సమాధానాలు సనాతన ధర్మంలో సిద్ధంగా ఉన్నాయన్నారు. గో సంతతిని పెంచేందుకు అందరూ కృషి చేయాలన్నారు. గోవును సాక్షాత్తూ లక్ష్మీదేవిగా, తల్లిగా భావించే భారతీయ సంస్కృతిలో ఆ జాతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామంలో నిర్మించినవి, నిర్మించబోతున్న శివ పంచాయతన క్షేత్రం, అగ్రిహోత్రుని ఆలయాలతో ఈ ప్రాంతం ధార్మిక క్షేత్రంగా ప్రత్యేకత సంతరించుకుంటుందన్నారు. మనుషులంతా ఐకమత్యంలో ఉండాలని పలు ఉదాహరణలతో భక్తులకు ఉపదేశం చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు పాశర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ మాట్లాడుతూ పలువురు దాతలు ఆలయ నిర్మాణాలకు సహాయ సహకారాలు అందజేసినట్టు తెలిపారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచె రాజా, మాజీ వైస్ ఎంపీపీ పోతుల మోహన్‌రావు, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు మల్లిరెడ్డి పాపారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, గ్రామ ఉప సర్పంచ్ బూరుగుపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

తపోవనం సందర్శన

తుని రూరల్: తుని మండలం కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో శృంగేరి మహా సంస్థానం ఉత్తరాధికారులు శ్రీవిధుశేఖర భారతీ మహాస్వామి పాల్గొన్నారు. విజయ యాత్రలో భాగంగా గురువారం మధ్యాహ్నం తపోవనానికి వచ్చిన శ్రీవిధుశేఖర భారతీ మహాస్వామికి పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు, వేద విద్యార్థులు, భక్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరీ అమ్మవారిని, తాండవ కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించి పూజలు చేశారు. సహస్ర మోదక మహా గణపతి, రుద్రయాగ పూర్ణాహుతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీవిధుశేఖర భారతీ మహాస్వామికి పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి దూళిపాద పూజ నిర్వహించి, సత్కరించారు. ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, దేవదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, లోవ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు, వేద పండితులు, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

- 13 జిల్లాల నుంచి 210 మంది హాజరు
- రేపటితో ముగియనున్న క్రీడా సంబరం



సాఫ్ట్‌బాల్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ రమేష్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో అండర్–17 బాలికల అంతర్ జిల్లాల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సాఫ్ట్‌బాల్ పోటీలు గురువారం కాకినాడ జిల్లా క్రీడామైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు అవసరం అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు హాజరైన వారు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని రాణించాలన్నారు. డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. పాఠశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి ఎల్.జార్జి మాట్లాడుతూ ఈ నెల 30 వరకు జరిగే ఈ పోటీలలో 13 జిల్లాల నుంచి 210 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. అనంతరం డీఈఓ రమేష్ క్రీడాకారులను పరిచయం చేసుకుని సాఫ్ట్‌బాల్ ఆడి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అతిథులు క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ పరిశీలకులు కె.ఈశ్వర్, అండర్–19 కార్యదర్శి శివరామకృష్ణ, ఎస్‌జీఎఫ్‌ఐ సంయుక్త కార్యదర్శులు సునీల్, పరశురాం, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు, ట్రెజరర్ రవికొర్ పాల్గొన్నారు.

విద్యాప్రగతిలో క్రీడలూ భాగమే

- కలెక్టర్ మహేష్‌కుమార్
- అంతర జిల్లాల అండర్ 14 క్రికెట్ పోటీలు ప్రారంభం



అంతర జిల్లాల అండర్–14 క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కోనసీమ కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్: విద్యా ప్రగతిలో క్రీడలూ భాగమేనని, క్రీడల ద్వారా విద్యార్థులు మానసిక, శారరీక, వ్యక్తిత్వ వికాసం వృద్ధి చెందుతుందని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ అన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర జిల్లాల బాలుర అండర్–14 క్రికెట్ పోటీలను గురువారం ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. విద్యార్థులు క్రికెట్ క్రీడలో సత్తా చాటి జాతీయ స్థాయికి వెళ్లాలని కలెక్టర్ ఆకాంక్షించారు. విద్యార్థులు, క్రీడాకారులు స్పోర్ట్స్ బ్యాండ్‌ను వాయిస్తూ కలెక్టర్ మహేష్‌కుమార్, డీఈవో షేక్ సలీమ్ బాషాలకు స్వాగతం పలికారు. కలెక్టర్ క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ అంతర జిల్లాల క్రికెట్ పోటీలు గురు, శుక్ర, శనివారాల్లో అమలాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం, బాలయోగి స్టేడియం, కిమ్స్ వైద్య కళాశాల క్రీడా మైదానాల్లో ఏక కాలంలో ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి దాదాపు 250 మంది వరకూ అండర్–14 క్రీడాకారులు హాజరై సందడి చేశారు. వారితో కలెక్టర్, జిల్లా విద్యా శాఖాధికారులు కొద్దిసేపు ముచ్చటించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు క్రీడాకారులకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్, అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజ రాజేశ్వరి దేవి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఫిజికల్ డైరెక్టర్ తోట రవి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఏవీ శ్రీనివాస్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి బీవీఎస్ మూర్తి, పలు పాఠశాలల పీడీలు, పీఈటీలు మ్యాచ్‌లను ఆడించారు.

తొలి రోజు మ్యాచ్‌లు

స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అంతర జిల్లాల క్రికెట్ టోర్నమెంటు ప్రారంభమయ్యాక తొలుత గుంటూరు, శ్రీకాకుళం జిల్లాల జట్లు తలపడ్డాయి. గుంటూరుపై శ్రీకాకుళం జట్టు పది పరుగుల తేడాతో విజయం సాధించింది. అనంతరం తూర్పుగోదావరి, కడప జిల్లాల జట్లు పోటీ పడ్డాయి. తూర్పు గోదావరి జిల్లా జట్టు కడప జిల్లా జట్టుపై 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. తర్వాత చిత్తూరు జిల్లా జట్టు 31 పరుగుల తేడాతో ప్రకాశం జిల్లా జట్టుపై విజయం సాధించింది. కృష్ణా జిల్లా జట్టు విజయనగరం జిల్లా జట్టుపై 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. బాలయోగి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌ల్లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు అనంతపురం జిల్లా జట్టుపై సూపర్ ఓవర్‌తో విజేత అయింది. పశ్చిమ గోదావరి జిల్లా జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై 61 పరుగుల తేడాతో విజయం సాధించింది.

నాణ్యమైన బంగారు ఆభరణాలకు వేగ జ్యూయలర్స్

- డిసెంబర్ 5న కాకినాడలో నూతన షోరూం ప్రారంభం
- పాల్గొనున్న సినీ నటుడు బాలకృష్ణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వేగ జ్యూయలర్స్ చైర్మన్లు నవీన్, సుధాకర్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రజలకు నాణ్యమైన బంగారు, వజ్రాభరణాలను అందిస్తూ వేగ జ్యూయలర్స్ ప్రజల విశ్వాసం పొందిందని ఆ సంస్థ చైర్మన్లు వనమా నవీన్, వనమా సుధాకర్ వివరించారు. కాకినాడలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో షోరూమ్ ప్రారంభోత్సవ వివరాలు వెల్లడించారు. కాకినాడ బాలాజీ చెరువు సెంటర్‌లో వేగ జ్యూయలర్స్ నూతన షోరూమ్‌ను డిసెంబర్ ఐదో తేదీన ప్రారంభిస్తున్నామని చెప్పారు. సినీ నటుడు నందమూరి బాలకృష్ణ, నటి సంయుక్త మీనన్ దీనిని ప్రారంభిస్తారన్నారు. షోరూమ్ ప్రారంభం సందర్భంగా కాకినాడ ప్రజలకు ప్రతి ఆభరణంపై తగ్గింపు ధరలు ఇస్తున్నామని చెప్పారు. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండగలతో పాటు వివాహ వేడుకలకు తమ షోరూమ్‌లో బంగారు ఆభరణాలను కొనుగోలు చేయాలని నవీన్, సుధాకర్ కోరారు. నాలుగో షోరూమ్ ప్రారంభం సందర్భంగా తరుగుపై 4.99 శాతం నుంచి 11.99 శాతం వరకూ తగ్గింపు ఉంటుందన్నారు. తాము 35 ఏళ్లగా నుంచి ఈ రంగంలో ఉన్నామని చెప్పారు. తెలుగు వారు అంతర్జాతీయ స్థాయిలో వ్యాపార రంగంలో రాణించాలని నటుడు బాలకృష్ణ చెప్పడంతో ప్రచారకర్తగా ఆయనను ఎంపిక చేసుకున్నామని తెలిపారు. త్వరలో హైదరాబాద్ చందానగర్, రాజమహేంద్రవరంలో నూతన షోరూమ్‌లు ప్రారంభిస్తామని చెప్పారు. వేగ సంస్థ కొత్త ప్రకటన (యాడ్ ఫిల్మ్) విడుదల చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

తుని: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు రికార్డులను పరిశీలించారు. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన ముగ్గురు సిబ్బంది కంప్యూటర్లను, ఇతర రికార్డులను గురువారం మూడుగంటల పాటు తనిఖీ చేశారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అలజడి నెలకొంది. దీనిపై సబ్ రిజిస్ట్రార్ సుబ్బారెడ్డిని వివరణ కోరగా గతేడాది ఏప్రిల్ 26న ఏసీబీ రైడ్ జరిగిందని, ఆ కేసుకు సంబంధించిన కొన్ని పత్రాల కోసం వచ్చారని చెప్పారు. గతంలో తుని కార్యాలయంలో అనధికార వసూళ్లు జరుగుతున్నటు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో అప్పటి ఏసీబీ అడిషనల్ ఎస్పీ సౌజన్య ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డుల పరిశీలనతో పాటు రూ.40,850ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి మళ్లీ ఏసీబీ అధికారులు విచారణ ప్రారంభించారు. అప్పట్లో కార్యాలయంలో పని చేసిన అధికారులు వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోయారు.